

కేజీబీవీలో గెస్ట్‌లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

ఖానాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల కేజీబీవీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు ప్రభుత్వం దరఖాస్తులు కోరినట్లు కళాశాల ప్రత్యేక అధికారి సునీత రాణి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో పీజీ సీఆర్టీ తెలుగు, జువాలజీ, ఫిజిక్స్ విభాగాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులను భర్తీచేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆయా సబ్జెక్టులలో డిగ్రీ, పీజీ, బీఎడ్‌తో పాటు టెట్‌క్వాలిఫై అయి ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నానికి పూర్తి వివరాలు జిరాక్స్ ప్రతులను మస్కాపూర్ కేజీబీవీలో తనకు అందజేయాలని సునీతరాణి పేర్కొన్నారు.

కిస్సా కుర్సీకా..



జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి హాట్ కేక్‌లా మారింది. ఆ కుర్చీ కోసం సీనియర్ నాయకులు పోటీపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో గతానికి భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు శ్రీహరిరావుకు తిరిగి అవకాశం లభించవచ్చన్న ప్రచారం జరుగుతోంది. అయినా సీనియర్లు ఏమాత్రం తగ్గడం లేదు. ఆ పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ముథోల్, ఖానాపూర్ ప్రాంతాలకు చెందిన నాయకులు తగ్గేదేలేదంటున్నారు. ఇప్పటికే జిల్లా పదవి కోసం పలువురు దరఖాస్తులు సమర్పించారు. రాష్ట్ర స్థాయిలో ఉన్న తమ గాడ్ ఫాదర్లతో ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

హాట్ కేక్‌లా డీసీసీ అధ్యక్ష పదవి

- పోటీ పడుతున్న సీనియర్ నాయకులు
- తమ గాడ్ ఫాదర్లతో ముమ్మర ప్రయత్నాలు
- ప్రస్తుత అధ్యక్షుడు శ్రీహరిరావుకు మళ్లీ చాన్స్ దక్కేనా ?
- తగ్గేదేలేదంటున్న పలువురు హస్తం నాయకులు
- నేటితో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు
- రేపు ఏఐసీసీ పరిశీలకుల రాక



నిర్మల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడే ఔత్సాహికులు తమ దరఖాస్తులను ఆదివారం మధ్యాహ్నం వరకు డీసీసీ క్యాంపు కార్యాలయంలో అందించాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం చివరి గడువు కావడంతో ఈ పదవిని ఆశిస్తున్న సీనియర్‌లంతా తమ వంతుగా దరఖాస్తులు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తనకు మరో చాన్స్ ఇవ్వాలంటూ శ్రీహరిరావు హైకమాండ్‌ను కోరినట్లు సమాచారం. కాగా నిర్మల్ నియోజకవర్గంతో పాటు ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి కూడా పలువురు సీనియర్ నేతలు డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తుండడంతో ఈసారి గట్టి పోటీ నెలకొనబోతోందని అంటున్నారు. రాజకీయ కేంద్రంగా పేరున్న నిర్మల్‌కు కాకుండా ఈ సారి ముథోల్ నియోజకవర్గానికి అవకాశం కల్పించాలంటూ ఆ ప్రాంత కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరంతా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకువెళ్లినట్లు చెబుతున్నారు. నిర్మల్ నుంచి ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో పాటు మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, మాజీమున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తితో పాటు పీసీసీ సభ్యుడు సాధ సుదర్శన్‌లు, జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు అలూరి కృష్ణవేణి పోటీలో ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ముథోల్ నుంచి కూడా పలువురు సీనియర్‌లు డీసీసీ అధ్యక్ష పదవి కోసం పట్టుబడుతున్న కారణంగా ఈ సారి పోటీ రసవత్తరం కానుందని అంటున్నారు.

పట్టుబడుతున్న ముథోల్ నేతలు...

ముథోల్ ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఈసారి డీసీసీ అధ్యక్ష పదవిని తమ నియోజకవర్గానికి కేటాయించాలని పట్టుబడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో పాటు జడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, సమతా సుదర్శన్‌లు, డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఇప్పటికే అధ్యక్ష పదవికి సంబంధించి తమ దరఖాస్తులను సైతం అందించినట్లు సమాచారం. ముథోల్ నియోజకవర్గంలో కూడా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో డీసీసీ అధ్యక్ష పదవిపై పీఠముడి పడవచ్చంటున్నారు.

ఖానాపూర్ నేతలు సైతం...

ఈ సారి ఖానాపూర్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. కడెం మండలానికి చెందిన సతీష్ రెడ్డి డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో కాంగ్రెస్‌కు ఏకైక ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గం ఖానాపూర్ కావడంతో అందరి దృష్టి ఇటువైపే ఉంది. ఖానాపూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ నేత దొనికెని దయానంద్ డీసీసీ పదవి కోసం పట్టుబడుతున్నారు. గతంలో కూడా దయానంద్ డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీపడ్డారు. అధిష్ఠానం సూచనలతో ఆయన అప్పట్లో వెనక్కి తగ్గగ ఈ సారి మాత్రం తనకే ఇవ్వాలంటున్నారు. సుదీర్ఘకాలం నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ తానూ అనేక కష్ట నష్టాలు ఎదుర్కొన్నానని, హైకమాండ్ తన పేరును పరిశీలనలోకి తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. మొదట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని సైతం దయానందకే కేటాయించనున్నట్లు ప్రచారం జరిగింది. అప్పటి రాజకీయ పరిణామాల కారణంగా దయానంద్‌కు ఆ పదవి దక్కలేదు. ఇలా చాలాసార్లు కీలక పదవులన్ని దయానంద్‌కు దక్కకుండా పోయాయని చెబుతున్నారు. ఈసారైనా తనకు డీసీసీ అధ్యక్ష పదవిని కేటాయించాలని ఆయన పట్టుబడుతున్నట్లు సమాచారం. శనివారం దయానంద్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

జూపల్లి ఫార్ములా ఫలించేనా..

ఇటీవల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా సమావేశమై ఐక్యతరాగం వినిపించారు. చిన్న విభేదాలను పక్కన పెట్టి ఏకతాటిపై నిలుస్తామని, స్థానిక అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జూపల్లి కృష్ణారావు సైతం జిల్లా కాంగ్రెస్ నేతలంతా గ్రూపులు పక్కన పెట్టి పార్టీ పటిష్ఠతకు, ఐక్యతకు కృషి చేయాలని వార్నింగ్ ఇచ్చారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడడం, డీసీసీ అధ్యక్షుడి పదవి తెరపైకి రావడంతో జూపల్లి ఫార్మూలా ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. నియోజకవర్గాల వారిగా ఎవరికి వారే అన్న తీరులో సీనియర్ నేతలు డీసీసీ పదవి కోసం పట్టుబడుతున్న కారణంగా ఆ పార్టీలో ఐక్యతరాగం కనిపిస్తుందో లేదోనన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లను అపహాస్యం చేయడం తగదు

- కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న దొనికెని దయానంద్, చిన్నం సత్యం, తదితరులు

ఖానాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, బీఆర్‌ఎస్‌లో ఉన్న బీసీ నాయకులంతా కాంగ్రెస్ తెచ్చిన బీసీ బిల్లుకు మద్దతు తెలపాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, మున్సిపల్ మాజీచైర్మన్ సత్యం సహా పలువురు బీసీ నాయకులు మాట్లాడారు. బీసీ బిడ్డలై ఉండి బీఆర్‌ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్ బిల్లును అపహాస్యం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఖానాపూర్ పట్టణంలో శుక్రవారం బీఆర్‌ఎస్ బీసీ విభాగం నుంచి పలువురు నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అధినేతతో పాటు ఓసీ నాయకులైన ఆ పార్టీ అగ్రశేణి నాయకుల మెప్పు పొందేందుకు స్థానిక బీసీ నాయకులు వారి మార్గదర్శకత్వంతో బిల్లును అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీలు ఏవైనా బీసీలంతా ఏకతాటిపై ఉండి కాంగ్రెస్ తెచ్చిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అమలు చేసే వరకు పోరాడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ సామాజిక వర్గాలకు అండగా నిలిచేందుకు కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీబిల్లును ప్రవేశపెడితే రాష్ట్రంలో అది జీర్ణించుకోలేని కొన్ని అగ్రవర్ణశక్తులు అడ్డుకుంటున్నాయన్నారు. బీసీపక్షపాతిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేకనే బీఆర్‌ఎస్, బీజేపీలు చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. భవిష్యత్తులో బీసీ బిల్లును అపహాస్యం చేసేలా ఎవరు వివరించిన సహించేది లేదని హెచ్చరించారు. ఇకనైనా పార్టీలకు అతీతంగా బీసీ బిడ్డలంతా ఏకమై కాంగ్రెస్ పార్టీ తెచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, నాయకులు జంగిలి శంకర్, శెట్టి శ్యామ్మోహన్ రావు, తూము చరణ్, గాజుల గంగన్న, మాజీ ఎంపీటీసీలు దర్శనాల వెంకటేష్, బండారి రవీందర్, మండల నాయకులు కోల శ్రీనివాస్, మదిరే సత్యనారాయణ, రాజేందర్, రాజు సహా పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఓటు చోరీతోనే బీజేపీకి అధికారం

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్



సంతకాల సేకరణ పత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఖానాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఓటుచోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారం దక్కించుకుంటోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఓటు చోరీ సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ఓటు చోరీని ప్రజలకు స్పష్టంగా వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓటుచోరీని ఆపి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఓటు సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ తమ డిక్లరేషన్‌ను సంతకాల ద్వారా తెలియజేయాలన్నారు. ప్రజలను సైతం చైతన్యపరిచి ఈ ఓటు చోరీపై సంతకాలను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మలరమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, నాయకులు జన్నారపు శంకర్, శెట్టి శ్యామ్‌మోహన్ రావు, జంగిలి శంకర్, గుగ్లావత్ రాజు, తూము చరణ్, సత్యనారాయణ, జహీర్, ఆసిఫ్ అలీ, స్వప్నిల్ రెడ్డి, గాజుల గంగన్న, లక్ష్మీపతి గౌడ్, సతీష్ రెడ్డి సహా పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే పరామర్శ

ఇటీవల అనారోగ్యం బారినపడి కోలుకుంటున్న ఖానాపూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు మహమ్మద్ ఇద్రిస్‌ను శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఇద్రిస్ ఇంటికి వెళ్లిన బొజ్జు పటేల్ ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇద్రిస్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఆందోళన చెందవద్దని ఇద్రిస్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, జిల్లా నాయకులు యూసఫ్ ఖాన్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, జహీర్, షబ్బీర్ పాషా, షౌకత్ పాషా, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఆసిఫ్ అలీ, స్థానిక నాయకులు ముషీర్, అమేర్, షారు, తదితరులు న్నారు.

బాలికలకు హక్కులపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిర్మల్‌రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు హక్కులపై అవగాహన అవసరమని వక్తలు అన్నారు. అంతర్జాతీయ గర్ల్‌చైల్డ్ డే సందర్భంగా కేజీబీవీ సోఫీనగర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏ2జే ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లా కో-ఆర్డినేటర్ శరత్‌కుమార్, సీఎస్ఎంఎస్ హారికరజిత, స్టాఫ్, టీచర్స్, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాల్యవివాహం గురించి, బాల కార్మికుల నిర్మూలన గురించి, ఆడపిల్లలపై లైంగిక దాడులు వంటి సమస్యలపై అవగాహన కల్పించే చర్చలు, ఇంటరాక్టీవ్ సెషన్లు నిర్వహించారు. పిల్లలకు వారి హక్కులు, రక్షణ, విద్యలో సమాన అవకాశాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిజ్ఞ, ప్రేరణాత్మక ప్రసంగాల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. కో-ఆర్డినేటర్లు మాట్లాడుతూ... పిల్లల విద్య, సాధికారత, సమానహక్కుల ప్రాముఖ్యతపై దృష్టి సారించారు. కార్యక్రమంలో విజన్ ఎన్జీవో ఏ2జే జిల్లా కో-ఆర్డినేటర్ శరత్ కుమార్, సీఎస్ఎంఎస్ హారిక రజిత, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దొరకక ఇందిరమ్మ లబ్ధిదారుల పాట్లు



తిరుపెల్లిలో ఇసుక తవ్వుతున్న ట్రాక్టర్ మిషన్

లక్ష్మణచాంద, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపెల్లి వాగులో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఇందిరమ్మ లబ్ధిదారులు శనివారం వాపోయారు. తమకు మంజూరైన ఇంటి నిర్మాణానికి ఇసుక దొరకటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3 నుంచి రూ.4 వేల అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో, సంవత్సరం మొత్తం మీద వేలాది సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారన్నారు. మండలస్థాయి అధికారులకు సమాచారం ఇస్తే పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాస్థాయి అధికారులైన కలెక్టర్, ఎస్పీ చొరవ తీసుకుని ఇసుక అక్రమ తవ్వకం - తరలింపును నివారించాలని కోరుతున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలను మీడియాకు వారు విడుదల చేసి వేడుకున్నారు.

విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలి

- పీడీఎస్‌యూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

నిర్మల్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేష్ మాట్లాడుతూ... కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సులు 2025-26 ప్రవేశాలు పొందిన ఫస్ట్ ఇయర్ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచి పేద విద్యార్థులపై భారాన్ని మోపిందని అన్నారు. ఒక్కో విద్యార్థికి రిజిస్ట్రేషన్ ఫీజు గతంలో 80 ఉండగా ఇప్పుడు రూ.1200లకు పెంచారు. రికగ్నేషన్ ఫీజు గతంలో 400లు ఉండగా ఇప్పుడు రూ.800లకు, ఐయూడీఎఫ్ ఫీజు గతంలో 60 ఉండగా ఇప్పుడు 300లకు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫీజు గతంలో 50 ఉండగా ఇప్పుడు రూ. 200లకు పెంపుదల చేసి విద్యార్థులపై తీవ్రభారాన్ని మోపారు. ఒక్క పరీక్ష ఫీజు మాత్రమే 750 గతంలో మాదిరిగానే యధావిధిగా కొనసాగిస్తున్నారు. గతంలో ఒక్కోవిద్యార్థి ఆయా అన్ని రకాల ఫీజుల కింద 1340 చెల్లించేవారు. ఇప్పుడు ఏకంగా ఆ ఫీజులు అన్ని కలిపి 3,250కి పెంపుదల చేశారు. గతం కంటే ఒకేసారి ఒక్కో విద్యార్థిపై 1910 రూపాయలు ఫీజు భారం పడుతుంది. ఒకేసారి ఇంత భారీ మొత్తంలో పెంచిన ఫీజులతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, పేద విద్యార్థులు ఏమాత్రం కట్టలేనటువంటి ఫీజుల భారాన్ని విద్యార్థులపై ప్రభుత్వం మోపడం సరికాదని తక్షణమే ప్రభుత్వం పునర్ ఆలోచించి ఫీజుల భారం తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, రాజ్, తరుణ్, వెంకటేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో చోరీ.. నిందితుల అరెస్ట్

- కేసు వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ



భైంసాలో కేసు వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ

భైంసా, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ముథోల్, తానూర్ మండల కేంద్రాల్లోని రెండు వైన్స్ దుకాణాల్లో చోరీలకు పాల్పడిన ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. శనివారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి దొంగతనాల కేసుల వివరాలను వెల్లడించారు. గత మే నెలలో ముథోల్‌లోని శ్రీ రాజారాజేశ్వర వైన్స్‌లో దొంగతనం జరిగిందన్నారు. ఆ తర్వాత గత నెల 22వ తేదిన తానూర్ మండల కేంద్రంలోని లక్ష్మీ వైన్స్ దుకాణంలో దొంగతనం జరుగగా, రెండు కేసులు నమోదు అయ్యాయన్నారు. ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, టెక్నికల్ సహాయంతో నిందితులను గుర్తించినట్లు అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా రేంజల్ మండలం తాడ్‌బిలోలికి చెందిన యాపరి వినోద్, బ్యాగరి రోహిత్, నీరడి శ్రవణ్ కుమార్, సాయి ఆదిత్యగౌడ్, నవీన్, దిలీప్ లు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. వినోద్ గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తుండగా, మిగతా ఐదుగురు నిత్యం సేవించేందుకు వచ్చేవారన్నారు. వీరు రెండు బృందాలుగా విడిపోయి చోరి చేయాలని నిర్ణయించుకున్నారు. ముథోల్ వైన్స్‌లో రూ. 2.50లక్షలు, తానూర్ వైన్స్‌లో రూ. 80వేల మద్యం బాటిళ్ల దొంగతనం చేసి వినోద్ బెల్టు షాపులో అమ్మకాలు జరిపారన్నారు. తాజాగా మరోమారు దొంగతనం చేసేందుకు శుక్రవారం రాత్రి ముథోల్‌కు రాగా, బస్టాండ్‌లో అనుమానస్పదంగా ఉన్న వీరిని పట్టుకున్నట్లు విచారించినట్లు తెలిపారు. ఈ రెండు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని, వినోద్ బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నామని, ఆ వివరాల ఆధారంగా నగదును స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సైలు షేక్ జుబేర్, బిట్ల పెర్సిస్ ఉన్నారు.



ఏఎస్పీకి మొక్క అందజేస్తున్న దృశ్యం

భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

భైంసారూరల్ : భైంసారూరల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం అడిషనల్ ఎస్పీ అవినాష్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అవినాష్ కుమార్ ఎస్పీ పుష్పాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పరిసరాలను పరిశీలించి, కార్డులు, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిశీలించాలని ఆదేశించారు. తగు సలహాలు, సూచనలు అందించారు. సీఐ నైలు భైంసారూరల్, శంకర్ ఎస్సై కుబీర్, ఎస్సై కుంటాల, డబ్ల్యూఎస్సై, పోలీస్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లలో నూతనోత్సాహం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఈసీ అనుమతి



రేషన్ అందిస్తున్న డీలర్ దృశ్యం

నర్సాపూర్(జి), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఇచ్చిన అనుమతి డీలర్లలో నూతనోత్సాహాన్ని నింపింది. ఎన్నికల నిబంధనలలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, అంగన్‌వాడీలు వంటి కొందరు పోటీకి అనర్హులుగా ఉన్నప్పటికీ రేషన్‌డీలర్లు చేయవచ్చని స్పష్టంగా పేర్కొనడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిర్మల్ జిల్లా, నర్సాపూర్ మండలంలోని 15 మంది రేషన్‌డీలర్లు (10 మంది పురుషులు, 5 మంది మహిళలు) సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీలర్లు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న కమీషన్ పెంపు, బయోమెట్రిక్ సమస్యలు, ప్రభుత్వ గుర్తింపు వంటి సమస్యలపై వారే పోరాడవచ్చని డీలర్లు అంటున్నారు. సొంత గొంతుకగా ప్రజాప్రతినిధులుగా మండల పరిషత్, గ్రామ సభల్లో తమ సమస్యలను బలంగా వినిపించుకునే అవకాశం ఉంటుందన్నారు. స్థానిక పాలనలో భాగస్వాములవ్వడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) లోపాలను సరిదిద్ది, సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించగలరు. ఇది వారికి వృత్తికి రాజకీయంగా, సామాజిక గొప్ప గుర్తింపు, గౌరవాన్ని తీసుకువస్తుంది. రేషన్‌డీలర్లు కేవలం పంపిణీదారులుగా కాకుండా ప్రజా సేవకులుగా స్థానిక ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించుకోవాలని డీలర్లు ఉవ్విళ్లూరుతున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేను మీ పాఠశాలలోనే చదివా : ఎమ్మెల్యే

ఇచ్చోడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నాడు.. ఇచ్చోడ జిల్లా పరిషత్‌ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించానని, నేడు ఎమ్మెల్యే అయ్యానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో నూత న భవన నిర్మాణానికి రూ. 5కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనానికి రూ. 2కోట్లు, గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాల మరమ్మతుల కోసం రూ.కోటి, నేరడిగోండ మండలంలోని లఖంపూర్, కుంటాల, ఇచ్చోడ గిరిజ ఆశ్రమ బాలికల పాఠశాల లో డైనింగ్ హాల్ నిర్మాణానికి ప్రతి పాఠశాలకు కోటి చొప్పున రూ. 3కోట్లు మంజూరు అయ్యాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, నాయకులు గాడ్గె సుభాష్, పాండురంగ్, శిరీష్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

బోథ్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బోథ్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో దాదాపు రెండున్నర కిలోమీటర్లు కాలినడకన తిరిగి ప్రజా సమస్యలను ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడం జరిగింది. రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఆందోళన చెందవద్దని పట్టణ వాసులకు భరోసా కల్పించారు. రూ.పది కోట్లతో పట్టణంలో రింగ్ రోడ్డు నిర్మిస్తామన్నారు. అంతేకాక పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని, పొచ్చెర క్రాస్ రోడ్డు నుంచి బోథ్ పట్టణం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందుకు సంబంధిత పంచాయతీరాజ్ ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. బూత్ బస్టాండ్ నుంచి వాగు మీదుగా పిప్పల్‌ధరి రోడ్డు వరకు నూతనంగా రోడ్డు నిర్మిస్తామన్నారు. బూత్ పట్టణ అభివృద్ధికి తాను బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. మరోవైపు బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి బోథ్ పట్టణం వరకు రూ.18కోట్లతో రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలను పంపించామన్నారు. అయితే, బోథ్ అభివృద్ధి కుంటు పడిందని, అందుకు గతంలో జరిగిన పొరపాట్లే అసలు కారణమని ఆయన పేర్కొన్నారు.

● ఎమ్మెల్యే కాలినడకన పర్యటన

ఎమ్మెల్యే అనిల్ కాలినడకన మండల కేంద్రంలో పర్యటించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గతంలో పట్టణ సమస్యలను పరిశీలించేందుకు ఎవరూ కూడా కాలినడకన రాలేదని, మీరు ప్రత్యక్షంగా చూసిన సమస్యలను పరిష్కరించాలని వివిధ కాలనీలలో మహిళలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటనతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్త పరిచారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌యాదవ్, డాక్టర్ రవీంద్రప్రసాద్, మాజీ ఆత్మచైర్మన్ మల్లెపూల సుభాష్, ఎలుక రాజుయూత్ అధ్యక్షుడు మెడిచెల్మ ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ పట్టణంలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అనిల్

పల్లెల్లో గంజాయి.. చిచ్చు!

(5వ పేజీ తరువాయి...)

ఇరికి కటకటాల పాలవుతున్నారు. మహారాష్ట్ర కేంద్రంగా గంజాయి దందా కొనసాగిస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా మారుమూల గ్రామాల్లో సంచరిస్తూ యథేచ్ఛగా గంజాయిని తరలిస్తున్నారు. గంజాయి మొక్కలను సాగు చేస్తూ పట్టుబడిన వారిని బయటకు తీసుకొచ్చేదుకు స్మగ్లర్లు ఎంతకైనా తెగిస్తున్నారు. అమాయక రైతులనే అరెస్టు చేస్తున్న అసలు సూత్రధారులను మాత్రం పట్టుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. వానాకాలం ప్రారంభంలోనే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడితే కొంత వరకైనా గంజాయి సాగు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో సాగుతున్న మత్తుదందాను మరింత లోతుగా దర్యాప్తు జరిపితే అసలు విషయం బయట పడే అవకాశం ఉందంటున్నారు.

సరిహద్దుల్లో నిఘా కరువు

జిల్లా సరిహద్దుల్లో అధికారుల నిఘా కరువవుతుందన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా బోరజ్, తలమడుగు, తాంసి, బోథ్, నార్నూర్, బేల, జైనథ్ మండలాల మీదుగా మహారాష్ట్రకు తరలిస్తూ అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో గుట్టు చప్పుడుకాకుండా సాగు చేస్తున్న గంజాయిని సేకరిస్తూ వ్యాపారులు సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్నారు. జిల్లా మీదుగానే గంజాయిని ఇతర రాష్ట్రాలకు రహస్యంగా తరలిస్తున్నట్లు తెలుస్తుంది. రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ ఇతర రాష్ట్రాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను భట్టి కిలో గంజాయి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అమ్మేస్తున్నారు. ఈ అడ్డదారులపై చాలా చోట్ల తనిఖీ కేంద్రాలు లేక పోవడంతో స్మగ్లర్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండానే పోతోంది.

ఆదిమ గిరిజన మహిళలకు పురస్కారం

ఉట్నూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన ఆదిమ గిరిజన మహిళ మర్సుకోలా సరస్వతికి క్రాంతి పురస్కారం అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివరిసటీలో సరస్వతి అవార్డును అందుకున్నారు. ఆదివాసీ గిరిజనులలో పీవీటీజీలకు చెందిన ఆదిమ మహిళల సామాజిక సేవకురాలు మర్సుకోలా సరస్వతికి సేవ పురస్కారం అవార్డు లభించింది. మాక్ష్ గ్లోబల్ సంస్థ వారు అందించిన అవార్డుల ఎంపికలో సరస్వతిని ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రజాగాయకుడు గద్దర్ కూతురు వెన్నెల, తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదన చారిల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ప్రతి సంవత్సరం వివిధ రంగాలకు అందిస్తున్న ఈ అవార్డులలో సమాజ సేవలో ముందుండి అత్యంత వెనుకబడిన ఆదివాసీ పీవీటీజీ మహిళ సరస్వతి ఈ అవార్డు అందుకోవడం అభినందనీయమని వారు అన్నారు. మర్సుకోల సరస్వతి యాక్షన్ ఎయిడ్ ఏకేపీ సంస్థ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజా సమస్యలు, మహిళ చట్టాల పైన, పర్యావరణ సమస్యలపైన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కారం వాసి అయిన మర్సుకోల సరస్వతికి ఈ అవార్డు దక్కడం ఈ ప్రాంతానికి గర్వకారణంగా పలువురు భావిస్తున్నారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.



పురస్కారం అందుకుంటున్న ఆదివాసీ గిరిజన మహిళ సరస్వతి

ప్రభుత్వ ఫలాలు పేదలకు అందాలి : ఎమ్మెల్యే

జైనథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఫలాలు నిరుపేదలకు అందాలంటే రాజకీయాలకు అతీతంగా పనులు జరగాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. నిరుపేదల సొంతింటి కలలు సహకారం చేసేలా చేపడుతున్న ఇండ్ల నిర్మాణం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం బోరజ్ మండలంలోని పూసాయి, మాండగడ గ్రామాలలో ఇందిరమ్మ, ప్రధానమంత్రి అవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లకు స్థానిక నాయకులు, లబ్దిదారులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఇళ్ల లేని నిరుపేదలు ఎవ్వరు ఉండకూడదని సదుద్దేశ్యంతో ఇప్పటికే 4కోట్ల 80లక్షల ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, ఈ సంవత్సరం మరో 2కోట్ల 40లక్షల ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, ఈ సంవత్సరం మరో 2కోట్ల 40లక్షల ఇంటి నిర్మాణ కార్యక్రమం జరుగుతుందన్నారు. పేదల సొంతింటి కలను సహకారం చేసేలా భూమిపూజ చేసిన ఇండ్లకు అధికారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఆదిలాబాద్ టౌన్: ప్రభుత్వ పతకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. రూ.20 లక్షల విలువైన చెక్కులను అందించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి అండగా సీఎంఆర్ఎఫ్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, వైద్య ఖర్చులను మొత్తం లబ్ధిదారులకు అందేలా చూడాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అత్యవసర సమయాల్లో ఇబ్బందికి గురికాకుండా ప్రజలు సైతం ఆరోగ్య ఇన్సూరన్సులు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంతోష్, దయాకర్, సత్యం, కరుణాకర్ రెడ్డి, రమేష్, దేవన్న, రవి రెడ్డి, మహేష్, వెంకన్న పాల్గొన్నారు.



బోరజ్ మండలం పూసాయిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల

బైక్ దొంగ పట్టివేత.. రిమాండ్

బోథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని వైన్స్ వద్ద నుంచి ఈనెల 6న సాయంత్రం మోటార్ సైకిల్ చోరికి గురైంది. దీంతో బాధితుడు సోనాల గ్రామానికి చెందిన రమాకాంత్ తన బైక్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా.. మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లాలోని ఇస్లాంపూర్ వద్ద వాహనాన్ని అమ్మేందుకు ప్రయత్నించగా స్థానిక పోలీసులు లోకేషన్ ఆధారంగా బైకును గుర్తించడం జరిగింది. బైక్ దొంగతనం చేసిన కృష్ణ పట్టుబడడంతో పూర్తి విచారణ చేపట్టగా సదరు దొంగత పై తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో దాదాపు పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేగాకుండా బైక్ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శనివారం రిమాండ్ చేస్తున్నట్లు ఎస్సై శ్రీసాయి ఈ సందర్భంగా తెలిపారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకోవడంతో పలువురు ప్రజలు పోలీసులను అభినందిస్తున్నారు.

మరో మహిళ అంబులెన్స్‌లో సుఖ ప్రసవం

ఉట్నూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలో 108 అంబులెన్స్‌లో మరో మహిళ సుఖ ప్రసవానికి నోచుకుంది. వరుసగా గత మూడు రోజులుగా 108 అంబులెన్స్‌లలో గిరిజన ప్రాంతాల మహిళలు ప్రసవిస్తున్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని హీరాపూర్ పి గ్రామానికి చెందిన పుస్నక గోదావరికి పురిటి నొప్పులు రావడంతో ఇంటి వారు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఉట్నూర్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉమ్మ నీరు పోవడంతో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కి రెఫర్ చేసి 108కు సమాచారం అందించారు. ఉట్నూర్ 108 సిబ్బంది ఉట్నూర్ ఆసుపత్రి నుంచి జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మహిళలకు పురటి నొప్పులు అధికం కావడంతో ఇంద్రవెల్లి సమీపంలో రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి ఈఎంటీ దత్తాత్రేయ అంబులెన్స్‌లోనే పురుడు పోశారు. సుఖ ప్రసవం గావించడంతో ఆ తల్లి ఆడబిడ్డకి జన్మనిచ్చింది. తల్లిబిడ్డలని సమీపంలో ఉన్న ఇంద్రవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సిబ్బందికి అప్పగించి వైద్యం అందేలా కృషి చేసినట్లు దత్తాత్రేయ తెలిపారు. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఉట్నూర్ అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కుంభోజి దత్తాత్రేయ, పైలెట్ మడావిబాపురావు, ఆశావర్కర్ జయసుధలు తెలిపారు.

బామ్మర్దికి ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన బావ రిమాండ్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బామ్మర్దికి రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన బావను రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. తలమడుగు మండలంలోని మందగూడకు చెందిన తొడసం భీం రావ్ ప్రస్తుతం పట్టణంలోని వన్ టౌన్ పరిధిలో ఉంటూ ప్రైవేట్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్నాడు. తలమడుగు మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన వరసకు బావ అయిన కుమ్ర నగేష్ రిమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని తొడసం భీం రావ్ వద్ద నుంచి రెండు సంవత్సరాల క్రితం రూ.20 వేలు తీసుకున్నాడు. అంతేగాకుండా అప్పటి నుంచి రిమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగం ఇప్పించకపోవడంతో గత ఆగస్టు నెలలో తొడసం భీంరావ్ స్థానిక వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు డబ్బులు ఇచ్చిన మాట వాస్తవం కావడంతో కుమ్ర నగేష్‌ను శనివారం రిమాండ్ చేసినట్లు సీఐ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నిరుపేద పెళ్లికి సాయం



బియ్యాన్ని విరాళంగా అందజేస్తున్న ఓకేఆర్ ఫౌండేషన్ బృందం

ఖానాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నిరుపేద అమ్మాయి పెళ్లి భోజనాలకు బియ్యాన్ని విరాళం అందజేసి ఓకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణంరాజు తన ఉదారతను చాటుకున్నారు. డబుల్‌బెడ్ రూమ్ కాలనీకి చెందిన అట్కాపురం శ్రీవాణి అనే నిరుపేద అమ్మాయి వివాహం ఇటీవల నిశ్చయమైంది. కాగా ఆ అమ్మాయి కుటుంబం పేదరికంలో ఉన్నట్టు తెలుసుకున్నారు. కృష్ణంరాజు పెళ్లి భోజనాలకు సరిపడా బియ్యాన్ని శనివారం విరాళంగా అందజేశారు. నిరుపేదలను ఆదుకోవడంలో ముందు వరుసలో నిలిచే కృష్ణంరాజును స్థానికులు అభినందిస్తున్నారు.

యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

కుంటాల, అక్టోబర్, 11 : (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో ముత్యం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి రెండోశనివారం పాఠశాలలకు సెలవు పాటించాలని జిల్లా అధికారులు నుంచి ఇది వరకు సమాచారం మేరకు అన్ని ప్రైవేటు పాఠశాలలకు ఒకరోజు ముందుగానే సమాచారం అందించామని అయినప్పటికీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం పాఠశాలలు నడిపినట్లయితే నిబంధనలు ఉల్లంఘించినందున జిల్లా అధికారులకు నివేదికలు పంపామన్నారు.

ఖానాపూర్ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

కడెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పలు సమస్యలను పరిష్కరించాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామ శివారు పల్లెప్రకృతి వనం, శ్మశాన వాటిక వరకు విద్యుత్ లేనందున రాత్రి అంధకారంగా ఉందని, రాత్రి వేళలో రైతులు పొలాలకు వెళ్లడం ఇబ్బందిగా మారిందని శనివారం యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముడికే మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సమస్యలపైన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో బుర్ర రవి గౌడ్, గోదూరి రాజేందర్, కంతి గంగాసాగర్, ముడికే పెద్ద మల్లేష్, పల్లె రాజారెడ్డి, రాపెల్లి మురళి, భూక్యా రాజేష్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదర్శం.. నర్సాపూర్ 30 పడకల ఆస్పత్రి

● త్వరలో విస్తరణ
● అత్యాధునిక పరికరాలు సమకూర్చాలని ప్రజల వినతి

నర్సాపూర్(జి), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలింతలు, శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ముందుంది మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రి. ప్రస్తుతం విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. దీనికి ప్రధాన కారణం ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందడమే. కొంతకాలంగా ఈ ఆసుపత్రిలో సుఖప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, చిన్నారులకు అత్యుత్తమ వైద్యం అందుతోంది. పుట్టిన శిశువులకు అవసరమైన ప్రత్యేక సంరక్షణ, అత్యవసర వైద్యసేవలు మెరుగయ్యాయి. డాక్టర్ నిరంతర పర్యవేక్షణ, సున్నితమైన వైద్య విధానం కారణంగా ఈ ఆసుపత్రి ఇప్పుడు తల్లులు, పిల్లలకు ఒక నమ్మకమైన కేంద్రంగా మారింది.

సెలవు రోజూ మెరుగైన వైద్యసేవలు...

సెలవురోజుల్లోనూ వంద మందికి పైగా ఔట్‌పేషెంట్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తారు. సెలవు రోజు కూడా అందుబాటులో ఉండటం పట్ల రోగులు, వారి బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిలో సదుపాయాలు మరింత విస్తరించాలని, అత్యధిక వసతులు కల్పించాలని కోరారు.

అత్యాధునిక వైద్యసేవలు అవసరం...

అత్యాధునిక వైద్య సేవలు అందించడానికి అవసరమై ఆధునాతన పనిముట్లు (పరికరాలు) యంత్రాల కొరత ఉందని మండల వాసులు గుర్తించారు. శిశువుల అత్యవసర చికిత్సకు ఉపయోగపడే వెంటిలేటర్లు, అత్యాధునిక స్కానింగ్ పరికరాలు వంటి వాటిని తక్షణమే సమకూర్చాలని వారు కోరుతున్నారు. మెరుగైన వైద్యానికి విస్తరిస్తున్న ఆసుపత్రికి అనుగుణంగా ఈ వసతులు తప్పనిసరి అని మండల ప్రజలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వాలు, దాతలు వెంటనే స్పందించి, ఈ ఆసుపత్రి విస్తరణకు, ముఖ్యంగా అత్యాధునిక వైద్య పనిముట్లను, యంత్రాలను అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఆసుపత్రి భవిష్యత్తులో మాతా శిశు సంరక్షణలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అంటున్నారు.




అడ్మిషన్ గదిలో ఉన్న చిన్నారికి పరిశీలిస్తున్న డాక్టర్

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం

● డా. రాజశేఖర్ రెడ్డి

ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాము. 30 పడకల ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాము. శిశువుల అత్యవసర చికిత్సకు కొంత ఎక్విప్‌మెంట్ అవసరముంది. ఆస్పత్రి విస్తరణ జరిగితే మరిన్ని వైద్య సేవలు అందతాయి.



అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



పట్టుబడిన ఇసుక తోడే యంత్రం, ట్రాక్టర్

నిర్మల్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని రూరల్ ఎస్సై లింబాద్రి అన్నారు. శనివారం మండలంలోని మంజులాపూర్ శివారులోని స్వర్ణ వాగులో ఇసుక తోడే మిషన్, ట్రాక్టర్లను కొట్ల(కే) గ్రామంలో ఇసుకతో యంత్రాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయని సోన్ ఎస్సై గోపి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోచంపాడ్ నుండి నిర్మల్ వైపు వెళ్తున్న ఏపీ 1 సీ 5488 నెంబర్ గల బైక్‌పై వెళ్తున్న సూర్యకాంత్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడిపిన ఏపీ 10 ఏక్యూ 7554 నెంబర్ గల కారు మాదాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థిని అభినందించిన కళాశాల బృందం



అభినందిస్తున్న యాజమాన్యం

లక్ష్మణ చంద, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామనపెల్లి గ్రామానికి చెందిన ఎలికె రిషి అనే విద్యార్థిని నిజామాబాద్‌లోని ఎస్ ఆర్ కళాశాల బృందం శనివారం అభినందించింది. అలాగే విద్యార్థి తల్లిదండ్రులైన ఆర్టిసి డ్రైవర్ ఎలికె పెద్దన్న, లక్ష్మీలను శాలువాతో సన్మానించారు. ఈ సంవత్సరం నీట్‌పరీక్షలో విజయం సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించడంపై పలువురు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్(జి), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బొల్లినర్సయ్య (38) అనే వ్యక్తి రెండు సంవత్సరాలు గా భరించలేని నడుము నొప్పితో బాధపడుతూ చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు సంవత్సరాలుగా ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా నొప్పి తగ్గకపోవడంతో బొల్లినర్సయ్య తీవ్ర నిరాశ చెందారు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఉదయం భార్య బొల్లి లక్ష్మీ బంధువులను పలకరించడానికి ఆదిలాబాద్ రిమ్స్‌కు వెళ్లిన సమయంలో నర్సయ్య ఇంట్లోని బెడ్‌రూమ్ దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కూతురు సౌజన్య తన తల్లికి సమాచారం అందించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పొద్దుటూరి సతీష్ రెడ్డి దరఖాస్తు



డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు ఇస్తున్న సతీష్ రెడ్డి

కడెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నేత పొద్దుటూరి సతీష్ రెడ్డి నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవికి డీసీసీ కార్యాలయంలో అధికారికంగా దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ యువతకు మరింత ప్రాధాన్యత ఇస్తే పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని గ్రామస్థాయి వరకు పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దండుగుల యాదగిరి పాల్గొన్నారు.

భైంసా ఆర్టీసీ బస్టాండ్‌లో ఏటీఎం చోరీకి విఫలయత్నం

భైంసా, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఏటీఎం చోరీకి విఫలయత్నం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బస్టాండ్‌లోని ఇండియ వన్ బ్యాంకుకు చెందిన ఏటీఎంను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తమ వెంట తెచ్చుకున్న ఆయుధాలతో ఏటీఎం మెషిన్‌లోని క్యాష్ బాక్స్‌ను పగులగొట్టెందుకు యత్నించారు. ఎంతకీ బాక్స్ పగులకపోవడంతో నిందితులు ఆయుధాలను అక్కడే వదిలి పెట్టి వెళ్లిపోయారు. శనివారం ఉదయం బస్టాండ్‌కు వచ్చిన ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై పలు వివరాలను సేకరించారు. కాగా, ఏటీఎంలో ఎలాంటి నగదు అపహరణకు గురి కాలేదని తెలిసింది. చోరీకి విఫలయత్నం చేసిన నిందితులను పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



పగిలి ఉన్న ఏటీఎం మెషిన్

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఏఎంసీ చైర్మన్

దిలావర్‌పూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం ఏఎంసీ చైర్మన్ భీమ్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భీమ్ రెడ్డిని దేవస్థానం చైర్మన్ మహేందర్ సన్మానించారు. దేవస్థానం ఈవో భూమయ్య స్వామివారి ఫోటో, ప్రసాదాన్ని అందజేయగా, అర్చకులు ఆశీర్వదించారు.



కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటున్న ఏఎంసీ చైర్మన్

పోయిరా గౌరమ్మ పోయిరావమ్మా


బతుకమ్మలను తీసుకువెళుతున్న మహిళలు

తాంసి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పోయిరా బతుకమ్మా.... పోయిరావమ్మా.... శ్రీలక్ష్మిని మహిమలు గౌరమ్మ... చిత్రమది తోచున్నమ్మ గౌరమ్మ... అంటూ మండలంలోని పలు గ్రామాలలో బతుకమ్మల నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన ఈ బతుకమ్మల నిమజ్జనం అద్యాంతం కన్నుల పండుగగా కొనసాగింది. తాంసి గ్రామంలోని మహిళలు బతుకమ్మలతో వందలాది మంది తరలివచ్చారు. పొన్నారి, హసన్పూర్, జామిడి, గొట్కూరి తదితర గ్రామాలలో సైతం బతుకమ్మల నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. రంగురంగుల పూలతో తయారు చేసిన బతుకమ్మలను మహిళలు మంగళ హారతుల మధ్య వాగుల్లో నిమజ్జనం చేశారు. కోలాటాలు, చప్పట్లు, పాటలు పాడుతూ బతుకమ్మల నిమజ్జనం ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మలతో మహిళలు ఆటలాడుతూ పాటలు పాడారు. కోలాటాలు వేశారు. అనంతరం స్థానికంగా ఉన్న వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ బతుకమ్మల నిమజ్జనాన్ని పురస్కరించుకొని భారీ బతుకమని ఏర్పాటు చేశారు. అనంతరం వారి వారి ఇళ్లల్లో చేసుకున్న తీపి వంటకాలను నలుగురికి వడించి ఆరాగించారు.

తలమడుగు: తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయ పండుగలో మహిళలు ఎక్కువ ఇష్టపడి చేసే పండుగ బతుకమ్మ పండుగను గత 15 రోజులుగా రంగురంగుల పూలతో బతుకమ్మను ఏర్పాటు చేసి ఆనందోస్థల మధ్య పండుగను జరుపుకున్నారు. శనివారం మండలం లోని దేవాపూర్. కజర్ల గ్రామం లో ఘనంగా బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని మహిళలు నిర్వహిం చారు. గంగమ్మ ఒడికి గౌర మ్మను రంగురంగుల పూలతో అలంకరించి భాజ భజంత్రీలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. వీరికి గ్రామాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.


కజ్జర్లలో బతుకమ్మలతో మహిళలు

గుస్సాడీ వేషధారణ..భలేభలే !!

ఉట్నూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిలాలో 150 వరకు గుస్సాడి దండారి బృందాలు ఏర్పాటుకానున్నాయి. సాంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న ఆదివాసీ గిరిజనులు తరతరాలుగా అడవి తల్లిఒడిలో ధూమ్ ధాంగా దండారి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఆదివాసీ గిరిజనులు ఆట పాటలకు ప్రా ధాన్యం ఇవ్వడంతో పాటు సాంస్కృతి సాంప్రదాయాలను నిక్కచ్చిగా కాపాడుకుంటున్నారు.ఆదివాసుల సంస్కృతిలో ఆట పాటలకు ఉన్న ప్రాధాన్యత గుస్సాడి దండారి నృ త్యం గోండుల విశిష్ట జీవనశైలిని కండ్లకుకట్టినట్లు చూపెడుతుంది. ఆదివాసీ గిరిజనులకు ఏ పండుగ వచ్చినా ఏ పబ్బం వచ్చిన ఆటపాటలకు ప్రాధాన్యమిస్తూ తమ ఆనందాన్ని పంచుకుంటారు.

దండారి నిధులు వచ్చేనా?

ఉమ్మడి జిల్లాలోని గిరిజన గూడాలలో ప్రతియేటా దీపావళి దండారి వేడుకలను పురస్కరించుకుని ప్రభు త్వం మంజూరు చేస్తున్న నిధులు ఈసారి విడుదల అవుతాయా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ప్రతీ సంవత్సరం ఒక్కోదండారి బృందానికి రూ.పదివేల వంతున కేటాయిస్తూ వచ్చిన ప్రభుత్వాలు గత సంవత్సరం రూ.15వేల వంతున కేటాయించింది. అంటే ఉమ్మడి జిల్లాలోని దండారి బృందాల కోసం గత సంవత్సరం రూ. 1.50కోట్లు కేటాయించింది. ప్రభుత్వం ఈసారి నిధులు కేటాయిస్తుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులు విడుదల అయ్యేవి. కాని ఇంత వరకు కాకపోవడంతో అ నుమానాలువ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్న భరోసా ఉందని, ఖానాపూర్ శాసన సభ్యులు వెడమబొజ్జుపటేల్ ద్వారా ప్రభుత్వానికి వినతి పంపిస్తామని ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు మేస్రం దుర్గుపటేల్ తెలిపారు.


జాతర గ్రామంలో డప్పు వాయిద్యానికి రూపాన్నిస్తున్న యువకులు

ఆదివాసీ గూడెల్లో దండారి వేడుకలకు సన్నద్ధం

బజార్‌హత్నూర్: దీపావళికి ముందు అడవితల్లి ఒడిలో భోగి పండుగతో ప్రారంభమై కొలబొడితో ముగిసే ఆదివాసీల పండగకు ఆదివాసీ గూడేల్లో సన్నద్ధత కొనసాగుతోంది. కాగా దండారి వేడుకలల్లో గుస్సాడిలదే కీలక పాత్ర. నెత్తిపై నెమలి పింఛం. ఆపింఛానికి ఇరువైపులా అడవి జంతువుల కొమ్ములు..ఆ పింఛం మధ్యలో తళుక్కుమని మెరిసే అద్దం,డప్పులు ఇతర సామగ్రికి గూడెల్లో రూపాన్నిచ్చే పనిలో నిమగ్నమై కనిపిస్తున్నారు. గ్రామా ల్లో గుస్సాడి నెమలి పింఛంతో టోపీ, డప్పులు ఇతర సా మగ్రి తయారీలో అందరూ లీనమై కనిపిస్తున్నారు. రో జంతా వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం డప్పుల దరువుతో ప్రతీ రోజు గ్రామ పటేల్ ఇంటి ఆవరణలో సందడి నెలకొని కనిపిస్తోంది. కాగా సోమ, మంగళవారాల్లో ప్రత్యేక పూజలతో సంబరం ప్రారంభం కానుందని గ్రామ పటేళ్లు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో దం డారి సంబరాల వేడుక ఉట్టిపడుతోంది.


అందంగా అల్లిన టోపి

రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించండి

కుంటాల,అక్టోబరు11:(ఆంధ్రజ్యోతి):కుంటాల మండలంలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరు తూ కుంటాలకు చెందిన యువ న్యాయవాది జక్కుల గజేందర్ ఆర్అండ్ డీఈ సునీల్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగాకల్లూరు నుంచి కుంటా ల ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ద్విచ క్రవా హన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతే గాకుండా ఈరహదారిపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయని, మూల మలుపుల వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని కోరడంతో స్పందించిన డీఈ త్వరలోనే రూ.3లక్షల అంచనా వ్యయంతో టెండరు పిలిపించి పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాది గజేంధర్


శబరిమలకు పాదయాత్ర


లింబా(కే) ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వామి

కుంటాల, అక్టోబరు 11:(ఆంధ్రజ్యోతి):కుంటాల మండలం లింబా(కే)గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి గురుస్వామి ఆదివారం నుంచి శబరిమలైకు పాదయాత్ర చేపట్టనున్న దృష్ట్యా శనివారం రోజు కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆదివారం ఉదయం 8 గంటలకు బాసర అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభం కానున్న ఈ పాదయాత్ర 45 రోజులకు శబరిమలై చేరుకోనున్నట్లు తిరుపతిరెడ్డి స్వామి తెలిపారు. ఈపాదయాత్రలో నిర్మల్ జిల్లా నుంచి దాదాపు 40మంది స్వాములు పాల్గొంటారని ఆయన తెలిపారు.

గుంతలు పూడ్చండి సారూ

▸ వాహనదారుల ఆవేదన


గుంతలమయంగా మారిన రోడ్డు

లోకేశ్వరం,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): లోకేశ్వరం మండల కేంద్రం నుంచి అర్లీ ఎక్స్ రోడ్ వరకు రోడ్డు అంతా గుంతలతో దర్శనమిస్తుంది. వాహనదారులు లోకేశ్వరం నుంచి అర్లీ ఎక్స్ రోడ్ వరకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడవలసి వస్తోంది. ఈ గుంతల రోడ్లలో ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి,రాత్రివేళల్లో అయితే ఎంత ప్రమాదకరమో చెప్పనక్కర్లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికే చాలా మందికి అనేక రకాలుగా ప్రమాదాలు జరిగా యని ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు.

రేపటి నుంచి ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభం

▸ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): 2వ సాధారణ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ కారణంగా తాత్కాలి కంగా నిలిపి వేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 13వ తేదీ (సోమవారం) నుంచి యధావిధిగా కొనసాగించబడుతుందని అబిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యధావిధంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజలు, అర్జీదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, విజ్ఞప్తులను నేరుగా అధికారుల సమక్షంలో సమర్పించు కోవచ్చని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ముఖ్య వేదికగా నిలుస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు

▸ నమ్మిస్తున్నారు.. నట్టేట ముంచుతున్నారు
▸ పట్టణంలో పెరుగుతున్న మోసాలు.
▸ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకీ సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుండడం ఓ వైపు ఆందోళన కలిగిస్తుంటే... మోసగాళ్లు కొత్త పంథాలను వెతక్కుంటూ అమాయకులను నట్టేట ముంచుతున్నారు. మాయమాటలు చెప్పి... బాధితుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పట్టణ పరిధిలో చోటు చేసుకున్న పలు ఘటనలు ఇందుకు నిదర్శనం నిలుస్తున్నాయి.

ఫోన్ చేసుకుంటానని చెప్పి ఫోన్‌తో పరార్

వాఘాపూర్ గ్రామానికి చెందిన చాకటి శ్రీకాంత్ ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల 4న స్థానిక భుక్తాపూర్ వద్ద ఓ వ్యక్తి వచ్చి ఫర్నిచర్ సామగ్రిని తీసుకెళ్లాలని బేరం కుదుర్చుకుని కొంత దూరం వరకు తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో స్నేహితుడికి కాల్ చేస్తానని చెప్పి బాధితుడి ఫోన్ తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫోన్ పే నుంచి రూ.51,600 నగదు బదలాయించుకున్నారు. ఈ ఘటనపై బాదితుడు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. మోసానికి పాల్పడ్డ వ్యక్తిని గుర్తించి సమాచారం ఇస్తే తగిన నజరానా ఇస్తామని సీఐ నాగరాజు తెలిపారు. అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు ఫోన్‌లు ఇవ్వొద్దని సూచించారు.


సీసీ కెమెరాకు చిక్కిన నిందితులు

ఆకలి తీర్చేందుకు వెళ్లి.. బండి పోగొట్టుకుని...

పురపాలక సంఘంలో వాటర్ మెన్‌గా పని చేస్తున్న గోదూరి అశోక్ శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి ఆకలిగా ఉందని చెప్పడంతో జాలిపడ్డ అశోక్ సదరు వ్యక్తి ఆకలి తీర్చేందుకు తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. మధ్యలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మద్యం దుకాణంలో మందు తాగారు. అక్కడి నుంచి గుర్తు తెలియని వ్యక్తి బండి నడపగా... పట్టణంలోని పలు చోట్ల బండిని తిప్పి మధ్యలో ఆయనను దింపేసి వాహనంతో సహా పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని గుర్తించి సమాచారం ఇస్తే బహుమతి అందిస్తామని ప్రకటించారు.

నీటిలోనే పంటలు ఇంటికి చేరేది ఎలా?


పిప్పల్‌ధరిలో నిల్వ నీటిలోనే సోయా పంటను కోస్తున్న కూలీలు

బోథ్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల రైతన్న భవితవ్యం అస్తవ్యస్థంగా మారింది. పది మందికి పట్టెడన్నం పెట్టే రైతు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. భారీ వర్షాల వల్ల మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల భూముల్లో ఇంకా నీరు నిలిచి ఉండడంతో పంటలను ఇంటికి తీసుకువచ్చేందుకు రైతులు పడరాని పాటు పడుతున్నారు. మండలంలోని పిప్పల్ ధరి గ్రామం సమీపంలో ఉన్న ఉండురవి రెడ్డి చేనులో సోయా పంట కొనేందుకు శనివారం కూలీలు వెళ్లారు. అయితే చేనులో నీరు నిల్వ ఉండడంతో వచ్చిన కూలీలు వెనుదిరిగి రాకుండా నీటిలో ఉన్న సోయాపంటను కోసి కుప్పలుగా వేయడం జరిగింది. పంట సాగు చేయడం ఒక ఎత్తు అయితే ఇంటికి పంటను తీసుకు రావడం మరో ఎత్తుగా మారిందని రైతులు వాపోతున్నారు. భారీ వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. మరికొన్ని రోజులు పంట నీటిలో ఉంటే చేతికొచ్చే సోయా విత్తనం మొలకెత్తే ఆస్కారం ఉందని రైతులు అంటున్నారు.

భద్రతకే కాదు, భవిష్యత్తుకు తోడుగా పోలీసులు

▸ సెలవుల నుంచి వచ్చి కేజీబీవీ విద్యార్థులతో కలిసి ఒక్కరోజు గడిపిన పోలీస్ అక్క టీమ్స్
▸ విద్యార్థుల సమస్యలు దగ్గరుండి తెలుసుకున్న పోలీస్ అక్కలు


మస్కాపూర్‌లో యోగాసనాలు చేయిస్తున్న పోలీసు అక్క


విద్యార్థిని చదివిస్తున్న పోలీసు అక్క

నిర్మల్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ తన వినూత్న ఆలోచనల మేరకు రూపొందించిన 'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి అన్ని పోలీస్ అక్క టీమ్‌లు తమ తమ స్టేషన్ పరధిలోని కేజీబీవీ పాఠశాలల్లో దసరా సెలవుల నుంచి వచ్చిన పిల్లలతో కలిసి 24 గంటలు స్కూల్ లోనే గడపడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ... విద్యార్థుల హృదయాల్లో భద్రతా భావనను బల పరిచే లక్ష్యంతో పోలీస్ అక్కకార్య క్ర మాన్ని ప్రారంభించాము. చిన్నారుల తో నేరుగా సమయం గడిపే ఈ కా ర్యా చరణ ద్వారా వారు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం కలుగుతోంది. దీని ఫలితంగా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలాగే వారిలో ఉండే భయ భ్రాంతులు, అభద్రత భావం క్రమంగా తొలగిపోతుందని పేర్కొన్నారు.

'పోలీస్ అక్క' ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు

- పాఠశాలలో పిల్లలతో కలిసి భోజ నం చేసి, రాత్రి అక్కడే బస చేశారు.
- పిల్లలతో మమేకమై స్నేహ పూర్వకంగా సమయం గడిపారు.
- మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై గురించి చెప్పడం జరిగింది.
- చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా మోటివేషన్ అందించారు.
- వారి సమస్యలు, భవిష్యత్తు ఆశయాల గురించి క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు.
- వారితో కలిసి చిరునవ్వులు పంచుతూ, మానవత్వాన్ని చాటారు.
- ఉదయమే యోగా, ఫిజికల్ ఎక్సర్సైజ్‌లు నేర్పించటం జరిగింది.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పోలీస్ అక్క


విద్యార్థులతో ముచ్చటిస్తున్న పోలీస్ అక్క

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను ఈనెల 24, 25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు బోజ్జ ఆశన్న పేర్కొన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పంచాయతీ ఉద్యోగులకు 51 జీఓ సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.ఇంద్రజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్, జిల్లా కోశాధికారి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరావు, గంగన్న పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బోథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా ఎదిగినట్లయితే కుటుంబానికి బాసటగా నిలిచే అస్కారం ఉందని శ్రీరామానంద తీర్థ పరిశీలకుడు సాయిలింగ వృద్ధ ఆశ్రమం వ్యవస్థాపకుడు ఆయన దెబ్బతి అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇక్కడి మహిళలుకుట్టు శిక్షణలో మొదటి స్థానం సాధించారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు.రానున్న మూడు రోజుల్లోపు మరో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు శ్రీజ ఆదిలాబాద్ జిల్లా సెంట్రల్ ఇన్‌చార్జీ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం

కుంటాల, అక్టోబరు, 11 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామంలో ఆదివారం రోజు రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కల్లూరు గ్రామానికి చెందిన కీర్తి శేషులు కాశగౌడ్ రాజవ్వల జ్ఞాపకార్థం కుమారులు నిర్మించిన నూతన ఆలయంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

బీఎస్ఎన్ఎల్, జియో సేవలు పనిచేయక వినియోగదారులకు తప్పని తిప్పలు

బోథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాలతో పాటు బోథ్ మండల కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగదారులకు జియో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ వ్యవస్థ పని చేయక పోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ సేవలు ఆశించిన స్థాయిలో లేక పోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్త పరుస్తున్నారు. మరోవైపు జియో ప్రైవేట్ టెలికం వారు సైతం మొదట్లో సిగ్నల్ వ్యవస్థను ఆశించిన స్థాయిలో ఉంచడంతో పెద్ద మొత్తంలో వినియోగదారులు జియో సేవల కోసం వివిధ టెలికం సంస్థల నుంచి మార్చుకోవడం జరిగింది. అయితే తీరా వినియోగదారుల సంఖ్య పెరిగిన తర్వాత సరైన సిగ్నల్ వ్యవస్థను నిర్వహించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఈ దుస్థితి నెలకొనడంతో టెలికం వినియోగదారులు అసహనం వ్యక్తపరుస్తున్నారు.

ఓటు చోరీపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగించండి

▸ ఏఐసీసీ సభ్యుడు జాదవ్ నరేష్

బోథ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరి పైన ప్రతి ఒక్కరికి అవగాహనకలిగి ఉండాలని ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్ పేర్కొన్నారు. శనివా రం మండల కేంద్రంలో పార్టీ పిలుపు మేరకు ఓటు చోరీ పైన సంతకాలను సేకరించారు. రాజ్యాంగంలో ఓటు హక్కు మనకు ఇచ్చిన ఆయుధమని దానిని కొందరు స్వార్థం కోసం వినియోగించుకుంటున్నారన్నారు. ఒకరి ఓటు ఇంకోకరు వేసే విధంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ నాయకులు బూరుగుల మల్లేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, సేవాదళ్ఇన్‌చార్జీ నల్ల రవి, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు కరుణాకర్, సీనియర్ నాయకులు శేఖర్, ఎక్స్ టీపీసీసీ అధ్యక్షులు సంజీవ్‌చంద్రశేఖర్,నాగనాథ్,శంషుద్దీన్ పాల్గొన్నారు.


ఓటుచోరీపై బోథ్‌లో సంతకాలను సేకరిస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

ఆదివారం 12 అక్టోబరు 2025



బ్రహ్మన్‌వాడదలో స్వామివారి రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కన్నుల పండువగా రథయాత్ర

» తరలివచ్చిన భక్తజనం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మన్‌వాడలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక శాస్త్రి మందిరంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తిని రథంలో ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల గోవిందా నామస్మరణ నడుమ రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్ కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరై రథయాత్రను ప్రారంభించారు. దారిపొడవునా అందమైన రంగవల్లులు వేసి రథానికి భక్తులు స్వాగతం పలకడం విశేషంగా ఆకట్టుకుంది. గోవింద నామ స్మరణ నడుమ వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. మాజీ కౌన్సిలర్ జోగురవి తో పాటు పలు వుర్డ్ నేతలు, భక్తులు పాల్గొన్నారు.



మాడగూడ గ్రామంలో గుస్సాడీ టోపీలను అల్లుతున్న ఆదివాసీ

గుస్సాడీ వేషధారణ.. భలే భలే!



గుస్సాడీ వేషధారణ

» ఆదివాసీ గూడెల్లో దండారి వేడుకలకు సన్నద్ధం
» ఉమ్మడి ఆదిలాబాద్‌లో 150 వరకు గుస్సాడీ బృందాలు
» సంస్కృతీ, సంప్రదాయాలకు ఆదివాసీల పెద్దపీట
» దీపావళికి ముందు ప్రారంభమై.. కొలబొడితో ముగిసే వేడుకలు
» గతేడాది దండారి బృందాలకు రూ.1.50 కోట్ల కేటాయింపు
» ఈ ఏడాది ఇప్పటికీ విడుదల కానీ 'దండారి నిధులు'

నెమలి పింఛం టోపీ తలపై.. ఒంటి నిండా విభూతి.. కుడి చేతిలో దుడ్డుకర్ర.. ఎడమ చేతి చంకలో జంతు చర్మంతో కనబడే సంచితో గుస్సాడీ వేషధారణ భలే భలేగా ఉంటుంది. ఇదే గుస్సాడీ వేషదారణ. గుస్సాడీ అంటే ఆదివాసీలు కొలిచే ఎత్మసూర్ దేవుడు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ అడవుల్లో దీపావళి దండారి వేడుకలకు గిరిజన గూడాలు సిద్ధం అవుతున్నాయి. ఆదివాసీ గిరిజనులకు తరతరాలుగా వస్తున్న సంస్కృతీ, సంప్రదాయాల పండుగ దండారి పండుగ. ముందుగా ప్రతీగూడెంలో భోగి పండుగ జరుపుకొని గుస్సాడీ దండారి వేడుకలను ప్రారంభిస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని అడవి తల్లి ఒడిలో భోగి పండుగతో ప్రారంభమై కొలబొడితో ముగిసే ఆదివాసీల పండగపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

(మరిన్ని వివరాలు 7వ పేజీలో..)



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలతో పోలీసులు

పల్లెల్లో గంజాయి.. చిచ్చు!

మస్తుగా మత్తు దందా

పచ్చని పల్లెల్లో.. గంజాయి సాగు చిచ్చురేపుతోంది. తరుచు జిల్లాలో గంజాయి మొక్కలు భారీగా పట్టుబడుతున్నాయి. తాజాగా ఆదిలాబాద్ రూరల్ మండలం అశోదా గ్రామ పరిసర ప్రాంతాల్లో 160 గంజాయి మొక్కలు పట్టుబడడం కలకలం రేపుతోంది. ఇటీవల గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో గంజాయి మొక్కలు పట్టుబడిన దాఖలాలు ఉన్నాయి. గుట్టుచప్పుడుకాకుండా అంతర్ పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారు.



» జిల్లాలోని పచ్చని పల్లెల్లో చిచ్చు రేపుతున్న గంజాయి మొక్కల సాగు
» సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్న వ్యాపారులు
» అమాయక రైతులను ఉచ్చులోకి దింపుతున్న స్మగ్లర్లు
» మారుమూల ప్రాంతాల్లో రహస్యంగా సాగుతున్న గంజాయి దందా
» క్షేత్రస్థాయిలో నిఘా సారించని ఎక్సైజ్ శాఖ అధికారులు

ఆదిలాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారులు క్షేత్ర స్థాయిలో దృష్టి సారిస్తే గంజాయి సాగు గుట్టురట్టయ్యే అవకాశం ఉందంటున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ జిల్లాలోను విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. జిల్లా సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల వద్ద సరైన నిఘా లేక పోవడంతోనే అడ్డదారుల్లో ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. స్థానిక వ్యాపారులతో చేతులు కలుపుతున్న గంజాయి స్మగ్లర్లు తమ చేతికి మట్టి అంటకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రతీసారి అమాయక రైతులు దళారులే పట్టుబడుతున్న అసలు సూత్రదారులు మాత్రం తప్పించుకుంటున్నారు. అయితే గంజాయి సాగుపై పోలీసులే దాడులు చేస్తూ పట్టుకుంటున్నా.. ఎక్సైజ్ శాఖ మాత్రం క్షేత్రస్థాయిలో నిఘా సారించడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ పథకాలు బంద్

గంజాయిని సాగు చేస్తూ పట్టుబడుతున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపి వేస్తున్నారు. అయినా మత్తుదందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడడమే లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, ఇతర సబ్సిడీలను నిలిపి వేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 30 నుంచి 50 మంది రైతులకు పథకాలను నిలిపి వేసినట్లు తెలుస్తుంది. పత్తి, సోయా, మొక్కజొన్న, జొన్న పంటల్లో అంతర్ పంటగా గంజాయిని సాగు చేస్తున్నట్లు సమాచారం. అడపాదడపగా అధికారుల తనిఖీల్లో పట్టుబడుతున్న మారుమూల రహస్య ప్రాంతాల్లో భారీగా గంజాయి సాగవుతున్నట్లు తెలుస్తుంది. క్షేత్ర స్థాయిలో నిఘా సారిస్తే జిల్లాలో క్వింటాళ్ల కొద్ది గంజాయి సాగు వెలుగు చూసే అవకాశం ఉంది.కొంత మంది గంజాయి సాగును ఉపాధి మార్గంగా మార్చుకొని సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అంతర్ పంటగా సాగైన గంజాయిని



అక్రమ మార్గాల గుండా తరలించి విక్రయిస్తున్నారు.

డబ్బులు ఆశ చూపుతూ..

గ్రామాల్లో అమాయక రైతులకు డబ్బు ఆశ చూపుతూ మత్తుదందా ఉచ్చులోకి దింపుతున్నారు.అమాయక యువత, రైతులే టార్గెట్‌గా స్మగ్లర్లు మత్తు దందాను కొనసాగిస్తున్నారు. అమాయకులే కేసుల్లో

(తరువాయి 6వ పేజీలో....)

నేడు ఉట్నూర్‌లో బీసీ సంఘాల సమావేశం

ఉట్నూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతు బీసీలను మోసం చేస్తున్నందున పార్టీలకు అతీతంగా బీసీలు అందరు ఏకం కావడానికి ఆదివారం ఉట్నూర్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సమన్వయ సంఘం నాయకులు తెలిపారు. ప్రభుత్వం హామీ ఇచ్చింది కానీ, అధికారము చేత బట్టి రెండు సంవత్సరాల తర్వాత బీసీల మీద ప్రేమలు వొలకబోస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికలకు వెళ్లిన మరుక్షణమే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు హైకోర్టును ఎన్నికలపై స్టే విధించేలా చేశారని బీసీ సంఘాల నాయకులు విచారం వ్యక్తం చేశారు. బీసీ ప్రజలందరు సమన్వయతో సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలు ఎంతో.. బీసీల వాట అంతా కావాలని, బీసీల సత్తా ఏమిటో నిరూపించుకుందామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఒక్కటై ముందుకు పోదామన్నారు. అంతేగాకుండా బీసీ ఎజెండా ముఖ్యం అన్నారు. ఈ సమావేశంలో ఉట్నూర్ మండల బీసీ సంఘాల నాయకులు, ప్రజలు, మేధావులు, రాజకీయ పార్టీల అతీతంగా అందరు రావాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి భూపెల్లి శ్రీధర్ రాజీనామా

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి శనివారం రాజీనామా చేశారు. ఈమేరకు లేఖను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు పంపించారు. 2001 నుంచి పార్టీలో ఉండి అనేక బాధ్యతలు నిర్వర్తించామని, అయినా పార్టీలో తనకు అవమానమే జరుగుతోందని ఆయన ఈ సందర్బంగా ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమార్లు పార్టీపై ఉన్న అభిమామన్ని చాటుకున్నానని, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు పాటు పడ్డట్లు ఆయన తెలిపారు. తనకు జరుగుతున్న అవమానానికి మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శ్రీధర్ వెల్లడించారు.

కిసాన్ యాప్‌తో రైతులకు ఇబ్బందులు : ఆత్మ చైర్మన్

బోథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ వల్ల రైతులకు నష్టం జరుగుతుంది తప్ప లాభం లేదని బోథ్ ఆత్మ చైర్మన్ రాజుయాదవ్ విమర్శించారు. ఈ యేడాది వర్షాల వల్ల రైతులు దిగుబడి రాక పండించిన పంటలను అ మ్ముకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు అన్నా రు. కేంద్ర ప్రభుత్వం పత్తి అమ్ముకునే రైతులకు కిసాన్ యాప్ ద్వారానే అమ్ముకోవాలని నిబంధనలు పెట్టడం వల్ల రైతులు ఇబ్బందులకు గురి అయ్యే అవకాశం ఉం దన్నారు. 12 శాతానికి పైగా తేమ ఉండవద్దని సీసీఐ అధికారులు పేర్కొనడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. అధిక వర్షాల వల్ల ఈ యేడాది తేమ శా తం పెరిగిందని పేర్కొన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ శాఖ మంత్రులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను జిల్లా ఎంపీతో పాటు బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తేమ విషయమై మాట్లాడాలని ఆయన కోరారు.

బాలికల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత

● జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులను కాపాడడం ప్రతీఒక్కరి బాధ్యత అని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో ష్యూర్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, వారి సంరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వారికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఒక వ్యవస్థనే పని చేస్తుందని, వారి కోసం ప్రత్యేకంగా జేజేబీ కోర్టు, చైల్డ్ లెన్, ఐసీపీఎస్, ష్యూర్ ఎన్‌జీఓ వంటివి విధులు నిర్వహిస్తున్నాయని డీసీపీం రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆపదలో ఉన్నవారు ఎవరికి భయపడకుండా డయల్ 1098, 100 నంబర్లకు కాల్ చేయాలన్నారు. కష్టపడి చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ం జక్కుల శ్రీనివాస్, ష్యూర్ ఎన్‌జీఓ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, క్రీడా పాఠశాల కోచ్ కబీర్ దాస్, డీసీపీయూ కౌన్సిలర్ పద్మ, చైల్డ్ హెల్ప్ లెన్ సూపర్‌వైజర్ వెంకటేష్, ఫీల్డ్ సూపర్‌వైజర్లు కిరణ్, సౌజన్య పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం అధ్యక్షురాలు మర్సుకోల సరస్వతి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాలికలతో మానవహారం నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన దంతనపల్లి మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికల సంరక్షన బాలికల ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ సునిత, ఉపాధ్యాయులు మహేశ్వరి, మడవి నీలాబాయి, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో బాలికలతో కలిసి కేక్ కట్ చేస్తున్న జిల్లా అధికారులు, పాఠశాల సిబ్బంది



ఉట్నూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల మానవహారం



మర్లపల్లి గ్రామ రైతులతో మాట్లాడుతున్న డీఈఈ

విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బందితోనే పరిష్కరించుకోవాలి : డీఈఈ

బోథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలుపాలని, వారే సమస్యలను పరిష్కరించుకుంటారని విద్యుత్ శాఖ ఆదిలాబాద్ డివిజనల్ ఇంజనీర్ ఇదన్న పేర్కొన్నారు. శనివారం ఏడీ లక్ష్మణ్ ఏఈ శ్రావణ్‌తో కలిసి పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా రైతుల చేలలో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లను నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. మీరే స్వయంగా మరమ్మతులు చేసుకోవడం వల్ల ప్రమాదాలు కొని తెచ్చుకున్న వారు అవుతారని పేర్కొన్నారు. ఎల్లవేళలా తమ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించడం సిద్ధంగా ఉంటారన్నారు. ఇందులో విద్యుత్ శాఖ అధికారుల వెంట స్థానిక రైతులతో పాటు లైన్‌మన్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా డాక్టర్ కాలే సతీష్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ క్లెం వెంకట్ రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ బండి సాయి క్రిష్ణతో పాటు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు డాక్టర్లు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల పేర్ల నమోదు

బోథ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేర్లు గల్లంతుకవడంతో ఆన్‌లైన్‌లో పేర్లు లేని లబ్ధిదారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము ఇళ్లు నిర్మించుకున్న మొదటి, రెండు విడత నిధులు మంజూరయ్యాయని, ఆ తర్వాత తమ పేర్లు గల్లంతు అయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఆందోళనను 'ఆంధ్రజ్యోతి'లో గత గురువారం ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానికంగా పరిశీలించాలని గ్రామ కార్యదర్శికి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో శనివారం కార్యదర్శి అశోక్ లబ్ధిదారులతో ఇంటింటికీతిరిగి పరిశీలించారు. బాధితుల ఆవేదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు రావడంతో తిరిగి గల్లంతైన పేర్లను నమోదు చేశారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా బరంపూర్ తిరుమల కొండ



కొండపై వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ నగేష్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి

● తలమడుగులో పర్యటించిన ఎంపీ గోడం నగేష్

తలమడుగు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ తిరుమల కొండను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దని కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ అన్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బరంపూర్ కొండపై స్వయంభుగా వెలిసిన తిరుమల కొండను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనకు కృషి చేస్తానన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి ప్రతి శనివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నేర్చుకొని మానసిక ప్రశాంతతతో జీవించాలని సూచించారు అనంతరం ఆల అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేదారేశ్వర రెడ్డి, మాజీ జెడ్పీటిసి గోక గణేష్ రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, తాంసి మాజీ జెడ్పీటిసి తాడిపల్లి రాజు సహకార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు చంద్రకాంత్, ప్రభాకర్, మహేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్ రావు, ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు నాగారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

● కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

తలమడుగు: గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమని అదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. శనివారం మండలంలోని బరంపూర్ గ్రామంలో ఏరాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు నగేష్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని , అందరూ స్థానిక సంస్థల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కలిసికట్టుగా పనిచేయాలన్నారు, మొన్నటి వరకు ఎన్నికలు జరుగుతాయో లేదో అని సతమతమైన కార్యకర్తలకు హాల్లాదకరమైన వాతావరణంలో ఉన్న బరంపూర్ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ద్వారా ప్రశాంతత చేకూరిందని అన్నారు, ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త స్థానిక సంస్థల్లో పోటీ చేసే తమ అభ్యర్థులకు సమయం కేటాయించి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇప్పటికే దాదాపు కోట్ల రూపాయలతో గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఇందులో జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు చంద్రకాంత్, మాజీ జెడ్పీటిసి తాటి పెళ్లి రాజు, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు బోండ్ల వెంకటస్వామి, మాజీ మండల కన్వీనర్ స్వామి, జిల్లా నాయకులు వెంకటస్వామి, సదానంద్, నారాయణరెడ్డి, భుజంగరావు, నాగార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.